

బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి స్వాగతం పలుకుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్ వార్త



# గ్రామ పాలనాధికారులతో విద్యార్థులకు ఇబ్బందులు

**-ధ్రువీకరణపత్రాల జారీలో జాప్యం**
**-అప్పుడు..ఇప్పుడు అంటూ అధికారులు కాలయాపన**
**-పట్టించుకోని ఉన్నతాధికారులు**



కాప్రా మండల తహసిల్ కార్యాలయం ఫైల్ ఫోటో...

**కుషాయిగూడ, నవంబర్ 21, ప్రభాతవార్త**

దేవుడు కనికరించినా పూజారి కనికరించని వైనం కాప్రా మండల తహసిల్ కార్యాలయంలో గ్రామ పరిపాలన అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న తీరు కాపుర మండల కార్యాలయంలో నెలకొన్నది. కాప్రా మండల తహసిల్ పరిధిలోకి వచ్చే జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ జవహర్ నగర్ మున్సిపాలిటీల పరిధిలో గల వివిధ కళాశాలలో పాఠశాలలో వివిధ సంస్థలలో చదువుతున్న పలు విద్యార్థులతో పాటు, వివిధ రకాల పోటీతత్వ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన కుల నివాస ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కాప్రా మండల తహసిల్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. గత కొన్ని నెలల క్రితం విద్యార్థులకు ఇతర లకు అవసరమైన ఆదాయ నివాస కుల దృవీకరణ పత్రాలు సహజంగానే లభించేవి. ఇటీవల కాలంలోనే వికారాబాద్ జిల్లా నుంచి రికార్డర్ అసిస్టెంట్ జూనియర్ అసిస్టెంట్లుగా వచ్చిన కొందరు జిపిఓలు అనగా గ్రామ పరిపాలన అధికారులు ఫీల్డ్ లో వర్క్ చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా కాప్రా సర్కిల్ కార్యాలయంలో తిష్ట వేసి కూర్చున్నారు. ఫీల్డ్ లో సర్వేలు ఇతర ఎంక్వైరీలు చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా మండల తహసిల్ కార్యాలయంలో ఆదాయ నివాస ఇతర ధ్రువీకరణ పత్రాల ధ్రువీకరణ పనిని మాత్రమే చేపట్టారు.

ఈ క్రమంలో గత కొన్ని నెలలుగా కాప్రా మండల తహసిల్ కార్యాలయానికి వచ్చే విద్యార్థులు ఇతర బాధితులు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు పొందడంలో నానా ఇబ్బందులకు గురవుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కళాశాలలో పాఠశాలలో ఇతర సంస్థలలో ఆదాయ నివాస కుల ధ్రువీకరణ పత్రాలు అత్యవసరం ఉందని రోజుల తరబడి తిరుగుతున్నామంటూ మొరపెట్టుకుంటుండగా సదరు ధృవీకరణ పత్రాలకు నెల రోజులు సమయం ఉందని నెల రోజుల వరకు ఇస్తాం వెళ్ళండి అంటూ దురుసుగా వ్యవహరిస్తున్న గ్రామ పరిపాలన అధికారుల తీరుపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అసలు "గ్రామ పాలనాధికారుల విధి ఏమిటి"...**

జిహెచ్ఎంసి మున్సిపాలిటీ పరిధిలో గ్రామ పరిపాలన అధికారుల అవసరం ఉందా ఉంటే వారి విధి విధానాలు ఏమిటి వారు ప్రజలకు ఏ విధంగా పనిచేయాల్సి ఉంటుంది అనే విషయంపై కొత్తగా సమస్య నెలకొన్నది. జిహెచ్ఎంసి మున్సిపాలిటీ పరిధిలో గ్రామ పరిపాలన అధికారులు అవసరమా అనే ప్రశ్న నెలకొన్నది. జిపిఓల పని ఏమిటని విషయానికి వస్తే గ్రామాలలో ఇన్చార్జిగా ఉంటూ ఫీల్డ్ లో సర్వే చేయాల్సి ఉంటుంది. భిన్నంగా ఫీల్డ్ లో సర్వే చేయకుండా కార్యాలయాలలో తిష్ట వేసి కూర్చోవడంలో ఆంతర్యం ఏమిటి, కార్యాలయంలో ఏముంది, అసలు వీరు ఫీల్డ్ కు ఎందుకు వెళ్లడం లేదు, అనే ప్రశ్నలు ప్రజలు లేవనెత్తుతున్నారు. కాప్రా మండల తహసిల్ పరిధిలోకి వచ్చే జిహెచ్ఎంసి పరిధిలోని కాప్రా సర్కిల్ జవహర్ నగర్ మున్సిపాలిటీలలో గ్రామ పరిపాలన అధికారుల పని ఏమిటి అని, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పత్తి కుమార్‌తో పాటు, పలువురు ప్రశ్నిస్తున్నారు.

**సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి**

కాప్రా మండల తాసిల్దార్ డిప్యూటీ తహసిల్దార్ తోపాటు ఉన్నత అధికారులు స్పందించి ధ్రువీకరణ పత్రాల విషయంలో ఆలస్య కాకుండా గతంలో సాధారణంగా లభించిన విధంగానే బాధితులకు సకాలంలో అందే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. జాప్యం చేయడానికి కారణాలు ఏమిటనే విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి బాధిత విద్యార్థులకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందే విధంగా చర్యలు తీసుకుని, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భగ్గుమంటున్న... కూరగాయల ధరలు



**-బెండకాయ 100, బీరకాయ-100 , చిక్కుడు 120 ,టమాటా 60-80, మిర్చి -80**
**-మిగతా కూరగాయలు అదే పరిస్థితి**
**-పేద,మధ్యతరగతి కుటుంబాలకు తప్పని ఇబ్బందులు**

**హైదరాబాద్, నవంబర్ 21,ప్రభాతవార్త:**

ఒవైపు మార్కెట్‌లో నిత్యావసర ధరలు చుక్కలు చూపిస్తుండగా కూరగాయలు సైతం బగ్గుమంటున్నారు. చాలి చాలని జీతాలతో నెట్టుకువస్తున్న మధ్యతరగతి ప్రజలకు,ఉపాధి కోల్పోయిన నిరుపేదలకు కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. గత కొన్నినెలల క్రితం రూ.100కే అన్నిరకాల కూరగాయలు దొరికేవి. కానీ ఇప్పుడు మాత్రం 100కు రెండు మూడు రకాలు కూడా రాని పరిస్థితి నెలకొంది. రైతుబజార్‌లతోపాటు కాలనీలో పెట్టిన వారాంతపు మార్కెట్లలో కూడా కూరగాయల ధరలుమండిపోతున్నాయి. శుక్రవారంమార్కెట్‌లో కూరగాయల ధరలు పరిశీలించగా, కిలో టమాట 40నుంచి 60 పలుకు తుండగా బెండకాయ -100, బీన్స్ -110-120, బీరకాయ -100-120, చిక్కుడు -120, వంకాయ -70-80, దొండకాయ 80-100, క్యాబేజీ 80, పచ్చిమిర్చి 80, కాకరకాయ 80, దోసకాయ 80, క్యాప్సికం 50, చిక్కుడు 55 ఉన్నాయి. ఆటు ఆన్‌లైన్‌లో కూడా వెజిటబుల్ ధరలు ఇలాగే ఉన్నాయి. మండిపోతున్న కూరగాయల ధరలపై వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారులు కూడా స్పందించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు వచ్చేవని కానీ ప్రస్తుతం రావడం లేదన్నారు. ఆకారణంగా కూరగాయలు ధరలు పెరిగాయని చెబుతున్నారు. వాస్తవానికి నవంబర్ మొదటి వారం వరకు వర్షాలు కురవడంతో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ప్రభావం దిగుబడిపై పడి నగరానికి దిగుమతులు భారీగా తగ్గి ఈ పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా నవంబర్ లో నగర మార్కెట్లకు సుమారు 3 వేల నుంచి 3.5 వేల టన్నుల కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం 2.3 2.5 వేల టన్నులు మాత్రమే దిగుమతి అవుతు న్నట్లు మార్కెట్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో తెలంగాణ జిల్లాల్లో ఉత్పత్తులు తగ్గితే పక్క రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతులు పెరిగేవి. ప్రస్తుతం పక్క రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో నగరానికి దిగుమతులు బాగా పడిపోయాయి. వర్షాలతో కూరగాయల సాగుకు తీవ్ర నష్టం జరగడంతోనే మార్కెట్ కూరగాయల దిగుమతులు తగ్గినట్టు మార్కెట్ అధికారులు చెబుతున్నారు. టమాటా ఈ సీజన్లో గత నెల వరకు కిలో రూ.20 లోపే ఉంది. కానీ ఇటీవల బహిరంగ మార్కెట్లో రూ.40-60కు చేరింది. ప్రతిరోజూ నగర మార్కెట్లకు దాదాపు 100కు పైగా లారీల టమాటా దిగుమతి అయ్యేది. ప్రస్తుతం 50 నుంచి 60 లారీల టమాటా వస్తోందని వారు పేర్కొన్నారు.

## విషంతాగి దంపతుల ఆత్మహత్య యత్నం

**-భార్య మృతి.. చికిత్స పొందుతున్న భర్త**
**-తట్టిఅన్నారం అటవీ ప్రాంతంలో ఆచూకీ**



మల్లేష్, సంతోషి (ఫైల్ ఫోటో)

**ఎల్.బి.నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:**

మార్నింగ్ వాకింగ్ కోసం వెళ్ళిన ఇద్దరు దంపతులు ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. భార్య అక్కడికక్కడే చనిపోగా భర్త ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.కె.పురం డివిజన్ మార్గదర్శికాలనీ రోడ్‌నెంబర్ 4లో నివాసం ఉంటూ కూరగాయల వ్యాపారం చేసే గడ్డమీడి మల్లేష్(45), జి.సంతోషి (37) ప్రతిరోజులాగా శుక్రవారం ఉదయం 5.30 గంటలకు వాకింగ్‌కు వెళ్లారు. తెల్లవారుజామున వెళ్లిన తల్లిదండ్రులు 7.30 దాటి చాలా ఆలస్యం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో వారి కుమారుడు జి.శివ రెండుసార్లు వారికి ఫోన్ చేశాడు. ఫోన్ చేసిన తల్లిదండ్రులు ఫోన్ ఎత్తలేదు. కొద్దిసేపటి తర్వాత తండ్రి మల్లేష్ తన పేరు మీద రూ.20 లక్షలు, తల్లి పేరు మీద రూ.20 లక్షలు ఎస్బిఐ బ్యాంకు నుంచి వస్తాయని వాట్సాప్ ద్వారా వాయిస్ మెసేజ్ పంపించాడు. మెసేజ్ చూసిన అనంతరం కుమారుడు శివ మళ్లీ ఫోన్ చేసినప్పటికీ ఫోన్ స్విచ్ ఆఫ్ అని రావడంతో ఆందోళన చెందిన శివ వెంటనే చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తల్లిదండ్రుల కోసం ఒక బృందాన్ని పంపించారు. పోలీసులు వారి కోసం వెతుకుతుండగా మల్లేష్, సంతోషి బండ్లగూడ తట్టిఅన్నారంలోని అటవీ ప్రాంతంలో విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు గుర్తించారు. పోలీసులు వారిని పరిశీలించగా సంతోషి అప్పటికే మరణించింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మల్లేష్‌ను వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## నకిలీ కుటుంబ సభ్యుల సర్టిఫికేట్ సృష్టించిన మహిళపై కేసు నమోదు

**అల్వాల్, నవంబరు 21 ప్రభాతవార్త:**

నఖిలీ కుటుంబ సభ్యులు సర్టిఫికెట్ సృష్టించిన మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మల్కాజిగిరి సైనిక్‌పురిలో నివసించే శ్రీమతి దాసరి లక్ష్మీ అల్వాల్ తహసీల్దార్ జారీ చేసినట్లుగా నఖిలీ కుటుంబ సభ్యులు సర్టిఫికెట్‌ను తయారు చేశారు. ఆమె గత ఏడాది 24 నవంబరు 2024లో మల్కాజిగిరి తహసీల్దార్‌కు కుటుంబ సభ్యులు సర్టిఫికెట్ కోసం మీసేవా కేంద్రంలో ధరఖాస్తు చేసుకుంది. లక్ష్మీ ధరఖాస్తును అప్పట్లో తహసీల్దార్ తిరస్కరించడం జరిగింది. దీంతో ఆమె నఖిలీ సర్టిఫికెట్‌ను సృష్టించినట్లు పోలీసులు తెలిపారు. అల్వాల్ తహసీల్దార్ రాములు ఫిర్యాదు మేరకు దాసరి లక్ష్మీపై కేసు నమోదు చేశారు.

## రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌ను కమిషనర్ సజ్జనార్ తనిఖీ



రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ రిసెప్షన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న నగర పోలీసు కమీషనర్ సజ్జనార్.

**బేగంపేట నవంబరు 21,ప్రభాతవార్త**

హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ వి.సి.సజ్జనార్ శుక్రవారం రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసారు.నేరుగా రిసెప్షన్ లో కూర్చున్న సీపీ అందుబాటులో ఉన్న అడ్మిన్ ఎస్సై నర్సింగరావును పోలీసుస్టేషన్ క్రైమ్ రేటుతో పాటు ఇతర వివరాలను ఇతర పోలీసు సిబ్బందిని అడిగి తెల్సుకున్నారు.అక్కడ ఉన్న ఫిర్యాదు దారులతో కమీషనర్ నేరుగా మాట్లాడారు.సుమారు 45 నిమిషాల పాటు నగర పోలీసు కమీషనర్ పోలీసుస్టేషన్‌లో ఉండి వివిధ విషయాలపై సిబ్బందిని ఆరా తీసారు.పోలీసు స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి సమస్యలు తెల్సుకుని వీలైనంత వేగంగా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సీపీ సూచించారు.రక్షక్ వాహనాలు,బ్లూకోల్ట్స్ సిబ్బందిని అనుక్షణం అప్రమత్తంగా ఉండేలా చూడాలని,డయల్ 100కు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలంటూ సీపీ సిబ్బందికి సూచించారు.స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బంది వద్దకు వెళ్లి వారి విధులు నిర్వర్తిస్తున్న తీరుపై సీపీ ఆరాతీసారు.వారికి పలు సూచనలు చేసారు.

## 36 మంది 52 సెట్ల నామినేషన్లు దాఖలు

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**



**హైదరాబాద్,నవంబర్ 21,ప్రభాతవార్త:**

మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఎన్నికలకు ఈ నెల 19వ తేదీ నుండి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. ఈఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నామినేషన్లు స్వీకరిస్తున్నామని, శుక్రవారం వరకు 36 మంది అభ్యర్థులు మొత్తం 52 సెట్ల నామినేషన్లు వేసినట్లు తెలిపారు,ఈ ప్రక్రియ ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు కలెక్టరేట్ లోని విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుందని నేటితో నామినేషన్ల స్వీకరణ ముగుస్తుందని తెలిపారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సంబంధిత ఫారాలను పూర్తి వివరాలతో పూరించి సమర్పించాలని అన్నారు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్టేట్ (ఎస్ఈఎం) జ్యోతి, లా ఆఫీసర్ శ్రీధర్, డిసీఓ ప్రసన్న, జిల్లా కోఆపరేటివ్ కార్యాలయ అధికారులు సుమలత, యండి. అజార్ యాఖూబ్,మహేష్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సిటీ టాస్క్‌ఫోర్స్ బాస్‌గా వైభవ్ గైక్వాడ్



సిటీ టాస్క్‌ఫోర్స్ బాస్‌గా నియమితులైన ఐపిఎస్ అధికారి వైభవ్ గైక్వాడ్.

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:**

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ బాస్‌గా మరోసారి ఐపిఎస్ అధికారిని నియమించారు. నాగర్ కర్నూలు ఎస్‌పి గా వున్న వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌ను టాస్క్‌ఫోర్స్ చీఫ్‌గా నియమిస్తూ సర్కారు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2018 బ్యాచ్ కు చెందిన ఈ యువ అధికారి ఎస్‌పిగా తొలి పోస్టింగ్ నాగర్ కర్నూలులోనే చేసి సమర్థుడైన అధికారిగా పేరొందారు. సిటీ టాస్క్‌ఫోర్స్ డిసిపిగా వున్న నాన్ కేడర్ ఎస్‌పి సుధీంద్రను సర్కారు బదిలీ చేసింది. ఆయన రెండేళ్లుగా ఇక్కడ వున్నారు. టాస్క్‌ఫోర్స్ ఛీఫ్‌గా తొలిసారిగా 2010లో ఐపిఎస్ అధికారి కొల్లి రఘురామి రెడ్డి అదనపు ఎస్‌పిగా వుండగా ఈ విభాగం బాస్‌గా నియమించారు. ఆ తరువాత గత అసెంబ్లీ ఎన్నికల వేళ నిఖితా పంత్ అనే మహిళా ఐపిఎస్ అధికారిని బాస్‌గా నియమించారు. ఎన్నికల అనంతరం ఆమె బదిలీ కాగా నాన్ కేడర్ ఎస్‌పి స్థాయి మహిళా అధికారి మరొకరు నియమితులయ్యారు. ఇప్పుడు మరోసారి ఎస్‌పి స్థాయి అధికారిగా ఐపిఎస్ అధికారి వైభవ్ గైక్వాడ్‌ను నియమించారు. వాస్తవానికి టాస్క్‌ఫోర్స్ అధిపతి పోస్టు గతంలో అదనపు ఎస్‌పి కేడర్‌లో నాన్ ఐపిఎస్ అధికారుల కోసం వుండేది. ఆ తరువాత దీనిని నాన్ కేడర్ ఎస్‌పి స్థాయికి పెంచి ఎస్ఐ ను ంచి నాన్ కేడర్ వరకు వచ్చిన అధికారి లేదా గ్రూప్ వన్‌లో డిఎస్‌పిగా ఎంపికై నాన్ కేడర్ ఎస్‌పి వరకు ఎదిగిన అధికారిని నియమించే వారు. ఇప్పటికీ ఇదే సాంప్రదాయం వుంది. అయితే ఈ సాంప్రదాయానికి పలుమార్లు తెరదించడం గమనార్హం. ఇక సిటీ టాస్క్‌ఫోర్స్‌ను మూడు విభాగాలుగా విభజించారు. ఇందులో మొదటిది సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేసేది. ఈ విభాగం కింద మధ్య, ఉత్తర మండలాలతో పాటు నార్కోటిక్ విభాగం వుంటుంది. రెండవది పాతబస్తీలోని పురానిహవేలి కేంద్రంగా పనిచేస్తుంది. దక్షిణ తూర్పు మండలాలతో పాటు దక్షిణ, పశ్చిమ మండలం ఈ విభా గం కింద వున్నాయి. కొత్తగా ఏడాదిన్నర క్రితం ఏర్పాటు చేసిన దక్షిణ, పశ్చిమ మండల విభాగం కింద పశ్చిమ, దక్షిణ, పశ్చిమ మండలాలు వున్నా యి. మొదటి విభాగం బాస్‌గా వున్న అధికారి వైభవ్ గైక్వాడ్ మొత్తం టాస్క్‌ఫోర్స్‌కు బాస్‌గా వ్యవహరిస్తారు. రెండవ విభాగానికి సిటీ పోలీసు విభాగంతో సుదీర్ఘ అనుబంధం కలిగి సమర్థుడైన అధికారిగా పేరొందిన అదనపు ఎస్‌పి అందె శ్రీనివాస్, మూడవ విభాగానికి టీ పోలీసు విభాగంతో సు దీర్ఘ అనుబంధం కలిగి సమర్థుడైన అధికారిగా పేరొందిన మరో అదనపు ఎస్‌పి ఇక్బాల్ సిద్ధిఖీ పర్యవేక్షకులుగా వున్నారు.

## సనత్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే తలసాని



అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సంజీవెడ్డి నగర్,నవంబర్ 21 ప్రభాతవార్త:** వాహన దారులు,ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రహదారుల అభివృద్ధి,విస్తరణ కోసం కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం సనత్ నగర్‌లోని ఫతే నగర్ ఫ్లైఓవర్ వద్ద రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో సకాలంలో జరిగే విధంగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను అదే శించారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ విస్తరణ కోసం స్థల సేకరణలో భాగంగా గుర్తించిన ప్రాపర్టీలకు సంబంధించి ఉన్న అడ్డంకులను కూడా పరిష్కరించి సీసీరోడ్డు నిర్మాణం పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమీర్‌పేటలోని కనకదుర్గమ్మ ఆలయం నుండి ఫతేనగర్ వరకు గల రహదారి నిత్యం ఎంతో రద్దీగా ఉంటుందని వివరించారు. ఇరుకైన రహదారి కారణంగా వాహన దారులు,ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి ఇబ్బందులను తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు. అమీర్‌పేట,సనత్ నగర్,బేగంపేట,బాలనగర్, కూకట్‌పల్లి, బోయిన్‌పల్లి పరిసర ప్రాంతాలకు ఎక్కువగా ఫతేనగర్ ఫ్లైఓవర్ నుండి రాకపోకలు సాధిస్తుంటారని,ఫ్లైఓవర్ ఇరుకుగా మారడంతో తరుచుగా ట్రాఫిక్ నిలిచిపోతుందని తెలిపారు. ఈ సమస్యపరిష్కారం కోసం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు విడుదల చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు గురౌతున్నారన్నారు. వెంటనే పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కొలను లక్ష్మి, సనత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడిన, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్,డిఈ సందీప్, హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏడి.వంశీ కృష్ణ, వాటర్ వర్క్స్ డిజిఎం శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఏసిపి సురేశ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు సురేశ్ గౌడ్, కరుణాకర్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి,ఖలీల్, ఫాజిల్, కరీంలాలా,రాజేశ్ ముదిరాజ్,శేఖర్, నోమాన్, జమీర్, పుష్పలత, పద్మ పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి, విజయశాంతిని కలిసిన నవీన్‌యాదవ్



విజయశాంతికి పుష్పగుచ్చాలు అందిస్తున్న నవీన్ యాదవ్

**జూబ్లీహిల్స్, నవంబరు 21, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్‌యాదవ్ శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సినీనటి, కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందించారు. ఎన్నికల సమయంలో ప్రచారం నిర్వహించి తన గెలుపుకు కారణమయ్యారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. వారి సంపూర్ణ సహకారం ఉండాలని కోరారు. నవీన్‌యాదవ్ వెంట కాంగ్రెస్ నేతలు ఆరిఫ్, సాయినాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం
### -చైర్మన్ చెకోలేకార్ లక్ష్మి



మార్కెట్ యార్డులో మరమత్తు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి ృ, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, ఇన్చార్జి ఎస్జిఎస్ చిలక నరసింహారెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్

**మలక్ పేట, నవంబర్ 21, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ యార్డు లోని ప్లాట్ ఫాం నెంబర్ వన్ లో రూ.45 లక్షలతో నిర్మించనున్న మరమత్తు పనులను చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ఇన్చార్జ్ ఎస్జిఎస్ చిలక నరసింహారెడ్డి, డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రూ 45 లక్షలతో మార్కెట్లో మరమ్మత్తు పనులను చేపట్టడం జరిగిందని వివరించారు. చాలా కాలం నుంచి మార్కెట్లో పెండింగ్ లో ఉన్న మరమత్తు పనుల కోసం నిధులను విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధి లోని మార్కెట్లలో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునీకరించనున్నట్లు వివరించారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నేలపాటి రామారావు, పన్నాల రాజేందర్ రెడ్డి, మహమ్మద్ షకీల్, ప్రత్యూష, సత్యనారాయణ, సాయిరాం, మాస్రత్ సుల్తానా, పాశం అశోక్ గౌడ్, కనకాల శివాజీ, కిషన్ సింగ్, దుగ్గు జగదీష్, మాదారం కృష్ణ, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శి సత్య లింగం, మాజీ డైరెక్టర్ మైలా రవికాంత్, ఆనియన్ అసోసియేషన్ కోశాధికారి టి. అనిల్ కుమార్, అధికారులు, సిబ్బంది, రవీందర్, పుష్పలత, మాధురి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### స్వేచ్ఛ బోడుప్పల్‌కు సహకరించాలి : కమిషనర్ శైలజ



బోడుప్పల్‌లో డంపింగ్ యార్డ్ ను సందర్శించిన కమిషనర్ శైలజ, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఇంజనీర్ నిఖిల్,తదితరులు

**బోడుప్పల్ ,నవంబర్ 21 ప్రభాతవార్త ;** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఎ.శైలజ ఘన వ్యర్థాల నిర్వహణ పార్కును సందర్శించి, కొనసాగుతున్న వ్యర్థాల ప్రాసెసింగ్ కార్యకలాపాలను సమీక్షించారు . కమీషనర్ శైలజ మాట్లాడుతూ... బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో నిత్యం 78 స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్తను సేకరించడం జరుగుచున్నది, కాని ఇట్టి స్వచ్ఛ ఆటోలకు తడి పొడి చెత్తను కలిపి అందచేయడం వలన డంపింగ్ యార్డ్ కు వచ్చే చెత్త అధికముగా రావడం జరుగుచున్నది, దీని వలన చెత్త నిర్వహణ , రవాణా చేయడం సమస్య గా మారడం తో పాటు, డంపింగ్ యార్డ్ త్వరగా నిండు చున్నది. కాలనీ వాసులకు, రెసిడేన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ పొడి చెత్త ను వేరు చేసి ఇచ్చే విధముగా ప్రజలకు అవగాహనా కల్పించి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ భారత్ కొరకు సహకరించాలని కోరనైనది. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ కమీషనర్ శ్యాం సుందర్ రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ నిఖిల్, డంపింగ్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు .

### అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం : కార్పొరేటర్



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ.13.40లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు దశరథ్ రెడ్డి, లింగయ్య, శ్రీధర్‌రెడ్డి, బుచ్చయ్య, ప్రభాకర్‌రెడ్డి, శివలింగం, అశోక్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఖాజాబాగ్‌లో..**

ఖాజాబాగ్‌లో రూ.49.15లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసలు రవితేజ, శివ నర్సింహా, వంశీ, మాధవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లపై ఆక్రమణలు తొలగించాలి : కార్పొరేటర్



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త:** సైదాబాద్ మెయిన్ రోడ్డు నుండి మాతృశ్రీ కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. రోడ్లను ఆక్రమించడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికుల ఫిర్యాదుతో శుక్రవారం అధికారులతో కలసి సమస్యను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిసి అలీ, ఏఎంహెచ్ఓ రుద్ర శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ ,స్థానికులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి యూవసేన ఉపేందర్ ఆధ్వర్యంలో సుమారు 1000మంది అయ్యప్పస్వాములకు శుక్రవారం అన్నప్రసాదాన్ని అందజేశారు. పలువురు దాతలు దైవ సమానులైన అయ్యప్పస్వామి భక్తులకు అవసరమైన భోజనాన్ని పంపిణీ చేసినట్లు డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్ గుప్తా తెలిపారు.

# నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలి

**-రాష్ట్రంలో సక్రమంగా ఉద్యోగాల భర్తీ చేయాలి**

**-తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్**



జిల్లా కేంద్ర గ్రంథాలయ సందర్శన సందర్భంగా నిరుద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న కవిత

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాల భర్తీ చేయాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆమె మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లోని రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ ఉన్న నిరుద్యోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. దాదాపు గంట సేపు గ్రంథాలయంలో గడిపిన ఆమెకు నిరుద్యోగ యువతీ యువకులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని, ఎదురవుతున్న సమస్యలను, ప్రభుత్వం తీర్చాల్సిన డిమాండ్లను ఆమెకు వివరించారు. అయితే వారి ఆవేదనను ఓపిగ్గా విన్న కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు అవుతున్నా నిరుద్యోగ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను తీర్చడానికి ఏ మాత్రం ప్రయత్నం చేయడం లేదని ఆమె విమర్శించారు. జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం అన్ని జిల్లాల్లో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులకు అండగా తెలంగాణ జాగృతి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. వారి సమస్యలపై కచ్చితమైన పోరాటం చేస్తామని ఆమె వెల్లడించారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఎలాంటి వివాదాలు లేకుండా రిక్రూట్‌మెంట్లు జరపాలని ఆమె సూచించారు. ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువత కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని లైబ్రరీల్లో మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షుడు కోల శ్రీనివాస్, బొల్లారం వెంకటరమణారెడ్డి, కర్రె కృష్ణ, శివారెడ్డి, అందుగుల సత్యనారాయణ, నరేష్, వేద భవాని, అర్చన సేనాపతిలతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, కవిత అభి.మానులు, తెలంగాణ జాగృతి సానుభూతిపరులు పాల్గొన్నారు.

## పార్కు కబ్జా చేసేందుకు యత్నించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి : కార్పొరేటర్



ఛత్రపతి శివాజీ పార్కు వద్ద కాలనీవాసులతో కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. నవంబర్. 21.ప్రభాతవార్త.** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీలో వినియోగంలో ఉన్న శ్రీ చత్రపతి శివాజీ పార్కును అక్రమంగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అట్టి రిజిస్ట్రేషన్ లను వెంటనే రద్దు చేయాలని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీ వాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ శ్రీపురం కాలనీలో సుమారు 5000 గజాల స్థలాన్ని పార్కు కోసం మరియు కొన్నిచోట్ల కమిటీ హాల్ కోసం, క్రీడా ప్రాంగణం కోసం స్థలాలను వదిలి పెట్టడం జరిగింది. అందులో భాగంగా పార్కు స్థలములో ప్రభుత్వం నుంచి లక్షల రూపాయలు వెచించి పార్కు స్థలమును అభివృద్ధి చేయడం జరిగింది.ఆ స్థలములను కొందరు వ్యక్తులు వనస్థలిపురం ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ తో కలిసి అక్రమంగా తప్పుడు పత్రాలు సృష్టించి వనస్థలి పురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. ఈ సమస్యను కాలనీవాసులు కార్పొరేటర్‌రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కార్పొరేటర్ వెంటనే ఇట్టి సమస్యను తెలంగాణ రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ,ఈటల రాజేందర్ గార్ల దృష్టికి తీసుకు వెళ్లి వెంటనే సమస్యను పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి,ఎంపీ చొరవతో పూర్తి స్థాయిలో విచారణ జరిపించి తప్పుడు రిజిస్ట్రేషన్ కు సహకరించిన ఇంచార్జ్ సబ్ రిజిస్టర్‌ను వెంటనే సస్పెండ్ చేశారు.త్వరలోనే ఇట్టి రిజిస్ట్రేషన్ పత్రాలను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు. అలాగే తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తుల పైన చట్టపరమైన మరియు న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు. ఇరిజిస్ట్రేషన్ సమస్యను వెంటనే పరిష్కరించిన గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, ముత్యమ్ రావు, మహేందర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, సికిందర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి,విఠల్ రెడ్డి, అరవింద్ రెడ్డి, పాండు రంగం, వెంకట్ రెడ్డి, రాజేందర్, వెంకట్ రమణారెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, నరసింహారెడ్డి,విద్యాదర్ మరియు తదితరులు ఉన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్



**నేరేడ్ మెట్, నవంబర్ 21 ,ప్రభాతవార్త :** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ కలిసి నిర్వహించిన మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి శాసన సభ్యుడు మర్రి రాజశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి కళాశాల ప్రాంగణంలోని రావి చెట్టును మాతృ వృక్షంగా నామకరణం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో యువత కీలకపాత్ర పోషించాల్సి న అవసరాన్ని గుర్తుచేశారు. మొక్కలు నాటడం మాత్రమే కాదు, వాటి సంరక్షణలో కూడా విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఒక మొక్కను బాధ్యతగా పెంచుకోవాలని, పర్యావరణ సమతుల్యం కాపాడడంలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో హెచ్ ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అనూష జైన్, సీనియర్ మేనేజర్ గగ్లాని మిథిలేష్ పాల్గొన్నారు. సంస్థకు చెందిన వందమంది వాలంటీర్లు తమ జీతం నుండి కొంత భాగాన్ని విరాళంగా అందించి, కళాశాల విద్యార్థులతో కలిసి వందలాది మొక్కలను నాటడం విశేషం.కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మా రెడ్డి పచ్చదనం విస్తరణ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.అటవీశాఖ సిబ్బంది, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో ఈ డ్రైవ్ విశేష స్పందనను రాబట్టింది. మొక్కల నాటకం అనంతరం హెచ్ ఆర్ బ్లాక్ ప్రతినిధులు ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు మరియు సిజిఆర్ అధ్యక్షురాలు లీలా లక్ష్మా రెడ్డికి జ్ఞాపికలను అందజేశారు.వందలాది మొక్కలు నాటడంతో కళాశాల ప్రాంగణం పచ్చదనంతో నిండి సుందరంగా మారింది. కార్యక్రమం ఉత్సాహభరితంగా, విజయవంతంగా ముగిసింది.

## ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో పుర ప్రముఖుల బేటి



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న ఉప్పల్ పుర ప్రముఖులు దృశ్యం.

**ఉప్పల్, నవంబరు 21 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో శుక్రవారం గ్రామ పుర ప్రముఖులు బేటి అయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఉప్పల్ ఇన్నర్ రింగ్ రోడ్డులో హబ్సిగూడ నుండి నాగోల్ వరకు, ఉప్పల్ మెయిన్ రోడ్డు ప్రక్క నుండి రోడ్డు బ్రిడ్జి నిర్మాణం గురించి స్థల యజమానుల నుండి భూసేకరణకై మున్సిపల్ అధికారులు ఇచ్చిన నోటీసులు జారీ చేశారని, దీని వల్ల స్థల యజమానులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. వరంగల్ రహదారితో పాటు, ఎల్బినగర్ రోడ్డు 200 అడుగుల రోడ్డుతో విస్తరిస్తున్నారని తెలిపారు. కారిడార్ పనులు నిర్మాణంతో ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. దీని వల్ల ఉప్పల్ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఉప్పల్ సర్కిల్‌లో యు టర్న్ తీసుకుని వెళ్లడం వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. దీంతోపాటు వరంగల్, ఎల్బినగర్ రోడ్డు విస్తరిస్తున్నారని తెలిపారు. ఉప్పల్ క్రికెట్ స్టేడియం నుంచి నిర్మిస్తున్న ప్లై ఓవర్ కారణంగా చాలా మంది భూయజమానులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, అండర్ పాస్ నిర్మించాలని సూచించారు. అండర్‌పాస్ నిర్మాణంతో సమస్య నెరవేరుతుందని, దీనిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, సల్ల వీరారెడ్డి, మేకల వెంకటరమణారెడ్డి, చర్ల రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నిదానకవి శ్రీరాములు, ప్రదీప్ పాల్గొన్నారు.

## మరో పాతబస్తీగా మహేశ్వరం నియోజకవర్గాన్ని మారుస్తున్నారు
### అందెల శ్రీరాములు యాదవ్



మామిడిపల్లిలో పర్యటించి మైనారిటీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణం జరుగుతున్న భూమిని పరిశీలిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల వల్ల మహేశ్వరం నియోజకవర్గం మరో పాతబస్తీగా మారుతున్నదని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని మామిడిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో 50 ఎకరాల భూమిలో హైదరాబాద్‌కు చెందిన మైనారిటీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణం చేస్తున్నారని తెలుసుకున్న ఆయన శుక్రవారం సదరు భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి భూమిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మైనారిటీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణం కోసం మహేశ్వరం నియోజకవర్గంలోని భూములు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఇక్కడి మామిడిపల్లిలో పలు ఆలయాలకు సంబంధించిన భూములు ఉన్నాయనీ అయితే ఈ నియోజకవర్గానికి సంబంధం లేని హైదరాబాద్ మైనారిటీ వెల్ఫేర్ స్కూల్‌ను ఇక్కడ ఎలా నిర్మిస్తారని ఆయన అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న భూములను వదిలి ఇక్కడ నిర్మించడంలో ఆంతర్యమేమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో మైనారిటీ స్కూల్ నిర్మాణాన్ని అంగీకరించే ప్రశ్నే లేదని ఆయన అన్నారు. స్థానిక గ్రామస్తులు కూడా పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని ఆయన వెల్లడించారు. ఈ మేరకు తక్షణమే నిర్మాణపు పనులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక మామిడిపల్లి వాసులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ముదిరాజ్ సంఘానికి రూ.62లక్షల నిధులు : రజితరెడ్డి



ముదిరాజ్ సంఘం నిధుల మంజూరు పత్రం అందజేస్తున్న కార్పొరేటర మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 21 ప్రభాతవార్త :** ఉప్పల్ ముదిరాజ్ సంఘానికి రూ.62 లక్షల నిధులు మంజూరు అయినట్లు స్థానిక కార్పొరేటర్ మందముల రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నిధుల మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి సంఘం ప్రతినిధులకు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి మరో సారి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ముదిరాజ్ సంఘం భవనం మిగిలిన పనుల కోసం రూ.రూ.62 లక్షలు, నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఉప్పల్ డివిజన్‌కు భారీగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నట్లుగా తెలిపారు. ఇదే తరహాలో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు మహంకాళి నరసింహ, ఈగ ఆంజనేయులు,,ఈగ సంతోష్, మహంకాళి కృష్ణ, ఈగ లక్ష్మణ్, రాపాక వెంకటేష్, కంచెమీది శివయ్య, ఈగ దాసు, ఈగ శ్రీనివాస్ ,ఈగ బాబు ,మంద శేఖర్, బోరంపేట రాము,ఈగ రాజేష్, తలారి జహంగీర్,కె. సతీష్ తదితరులు పాల్గొన్నారు

### రంగారెడ్డి బ్యాంకు మూడవ శాఖ ప్రారంభం



బ్యాంకును ప్రారంభిస్తున్న ఉప్పల మంజుల వెంకటేష్ గుప్తా

**ఎల్.బి.నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** రంగారెడ్డి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మూడవ శాఖను శుక్రవారం కర్మాన్‌ఘాట్ రాఘవేంద్ర కాలనీలో ఏర్పాటు చేశారు. రంగారెడ్డి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బచ్చు బద్రీనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన బ్యాంకు మూడవ శాఖను ముఖ్య అతిథులుగా హాజరైన మిషన్ భగీరథ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా జ్యోతి ప్రజ్వలన చేయగా ఆయన సతీమణి ఉప్పల మంజుల రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకులో ఎంతగానో దోహదపడతాయన్నారు. ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. వ్యాపార లావాదేవీలు జరిగే సమయంలో ఖాతాదారులు సిబ్బంది పరస్పర సహకారంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, హనుమంత్ సాగర్, తలకొండ కిషన్, బచ్చు శ్రీనివాస్, జూలూరి శంకర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

### స్మశాన వాటిక ధ్వంసం సరైంది కాదు



స్థానికులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** స్మశాన వాటిక విధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. రాక్‌టౌన్‌కాలనీ పెట్రోల్ బంక్ వెనుక భాగంలోని సర్వే నెంబర్ 66/15 హిందూ ముస్లిం స్మశాన వాటికలో గుర్తుతెలియని వ్యక్తులు అశాంతి వాతావరణం సృష్టిస్తూ పలు సమాధులను, ప్రహరీ గోడలను కూల్చడం జరిగిందని పరిస్థితిని గమనించిన స్థానికులు వెంటనే సంఘటితమై కార్పొరేటర్ పవన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు.సమాచారం తెలిసిన కార్పొరేటర్ వెంటనే స్మశాన వాటికలో పరిస్థితిని పరీక్షించి తమ తమ పూర్వీకులకు గుర్తుగా నిర్మించుకునే సమాధులను కూల్చడం విద్వేష పూరితమైన చర్య అన్నారు. ప్రజల భద్రత, కాలనీ శాంతి భద్రత దృష్ట్యా స్మశాన వాటిక ప్రాంతాన్ని ధ్వంసం చేస్తున్న, అక్కడ సమస్యలు సృష్టిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఎటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జోగు రాములు, లింగస్వామి, కిషన్, భిక్షపతి, సయ్యద్‌యునుస్, జాఫర్‌ఖాన్, సయ్యద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు..

### బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అధ్వాన్నంగా మారిన రోడ్లను నిర్మించాలి
**కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి**



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అధ్వాన్నంగా తయారైన ప్రధాన రహదారుల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కమీషనర్ సరస్వతిని కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు కమీషనర్‌ను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్మాస్‌గూడ నుండి గుర్రంగూడ, నాదర్‌గుల్ కోటగడ్డ నుండి హరిజన వాడ, నాదర్‌గుల్ నుండి హరిజనవాడ రోడ్లతో పాటు బడంగ్‌పేట్, బాలాపూర్‌లలో రోడ్లు దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు కమీషనర్‌కు వివరించారు. అయితే రోడ్ల నిర్మాణానికి సంబంధించి టెండర్లు దక్కించుకున్న వారు వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేసేటట్లు చర్యలు తీసుకోవాలని వారు కమీషనర్‌ను కోరారు. అదే విధంగా అవసరమైన చోట్ల రోడ్లకు మరమ్మతులు చేయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఇంఛార్జి బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, గుర్రం లక్ష్మీనరసమ్మ, లింగారెడ్డి పాల్గొన్నారు.

## కొడుకు మృతికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల ధర్నా



రామంతాపూర్‌లో బంగారు షాపు ముందు ధర్నా నిర్వహిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు దృశ్యం.

**రామంతాపూర్, నవంబరు 21 ప్రభాతవార్త :** రామంతాపూర్‌కు చెందిన వెంకట సాగసాయిమూర్తి మహాశ్విన్(18) మృతికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడు బంధువులు శుక్రవారం దుకాణం ముందు ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత సెప్టెంబర్ 21న ములుగు జిల్లా వాజీడు సమీపంలోని కొంగాల జలపాతం వద్ద సెల్ఫీ తీసుకుంటూ సాగసాయిమూర్తి మహాశ్విన్ కాలు జారి జలపాతంలో పడి మునిగిపోయి మరణించాడు. దీంతో రామంతాపూర్‌కు చెందిన పూజ జువెల్లర్స్ షాపు యజమానులు కారణం అని ఆరోపిస్తూ దుకాణం ముందు తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. తమ కుమారుడిని స్నేహితులు తీసుకెళ్లి హత్య చేశారని, దీనిపై న్యాయం చేయాలని పలువురికి విన్నవించినా న్యాయం చేయడం లేదని ఆరోపించారు. దీంతో జ్యువెల్లరీ షాపు ముందు బైఠాయించి ఆందోళన చేయడంతో పోలీసులు చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఉప్పల్ పోలీసులు వివరణ ఇస్తూ ములుగు జిల్లాలో జరిగిన సంఘటనపై అక్కడి పోలీసులు విచారణ చేస్తున్నారని, ఆరోపణలపై మరోసారి విచారణ చేస్తామని తెలిపారు.

**నేడు రామంతాపూర్‌కు ఎంపి ఈటల రాజేందర్ రాక**

**రామంతాపూర్, నవంబరు 21 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు శనివారం మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డి వస్తున్నారని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ తెలిపారు. రామంతాపూర్ నెహ్రునగర్, ఇందిరానగర్, ఆర్‌టిసి కాలనీ, బాలకృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో రూ.కోటి వ్యయంతో పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రామంతాపూర్ డివిజన్ బిజెపి నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### 42శాతం బిసి బిల్లును అమలు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బొడ్డుపల్లి కృష్ణ

**ఎల్.బి.నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** 42 శాతం బీసీ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే నిరసన దీక్షలను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొడ్డుపల్లి కృష్ణ విజ్ఞప్తి చేశారు. నాగోల్‌లోని ప్రజా సంఘాల కార్యాలయం ఎస్ఏడాంగే భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి ఎల్బీనగర్ నియోజకవర్గం సమావేశం సంగు సైదారావు అధ్యక్షతన నిర్వహించి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ... బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఆర్థిక, రాజకీయంగా, సామాజికంగా అన్నిరంగంలో మేలు జరిగే విధంగా కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ సమావేశంలో యు.మల్లేష్‌గౌడ్, ఎస్.గోపాల్, కే.పాండు, పి.మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

### శివసాయినగర్‌లో ఘనంగా పోలి స్వర్గం పూజలు



పోలి స్వర్గం పూజలు చేస్తున్న మహిళలు

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కాలనీలోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో పోలి స్వర్గం పూజలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో అరటి దొప్ప దీపాలు వదిలారు. పోలి స్వర్గం పూజల సందర్భంగా లఘున్యాసక పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు జరిపారు.ప్రధాన అర్చకులు లక్ష్మీ గణపతిరావు, గంగా రామ కృష్ణ,శ్రీకాంత్‌శర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి,వెంకట కృష్ణారావు, వెంకట రమణ, శ్రీగాయత్రీ సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### రూ.27లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు



చిలుకానగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 21 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ సాయిరాంనగర్‌కాలనీలో రూ.27 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణ సమయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. పనులలో నాణ్యత పాటించే విధంగా చూడాలని కోరారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిఇ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఏదుల కొండల్‌రెడ్డి, కొక్కొండ జగన్, పల్లె వేణుగౌడ్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బంటి గౌడ్, సాయిరాంనగర్ కాలనీ అసోసియేషన్ నేతలు సాబీర్ పాషా, ప్రకాష్, రవీందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.